ఇంటి నంబర్లు ఇవ్వాలి

మున్సిపల్ కమిషనర్‌కు సీపీఎం వినతిపత్రం

జనగామ, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలో మూడో విడుత పట్టాలు పొంది రేకుల షెడ్లు వేసుకున్న లబ్ధిదారులకు ఇంటి నంబర్లు ఇవ్వాలని సీపీఎం నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. జోగు ప్రకాశ్ మాట్లాడుతూ పేదలు నానా కష్టాలు పడుతూ రేకుల షెడ్లు వేసుకున్నారని తెలిపారు. వీరి ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఆయన కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పక్కా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల రుణం ఇవ్వాలని, కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూడిద గోపి, సుంచు విజేందర్. ఇందిరమ్మ లబ్ధిదారుల సంఘం అధ్యక్షుడు కళ్యాణం లింగం, పల్లెర్ల లలిత, ఎర్ర రజిత, మునిపట్ల జయ, కొమ్మగల్ల మణి, బండ రమాదేవి, ఏనుగుల కమల, సౌందర్య, కొన్నె శాంత, రమ, సుధాకర్ పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినితిపత్రం ఇస్తున్న ఇందిరమ్మ లబ్ధిదారులు

సహకార బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

డీసీసీబీ డైరెక్టర్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి

తరిగొప్పుల, జూన్ 14: సహకార బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక బ్యాంకు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీబీ దశాబ్ది డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. అనంతరం డిపాజిట్ పథకం కరపత్రాలను ఆవిష్కరించి రైతులకు అవగాహన కల్పించారు. దశాబ్ది డిపాజిట్ పథకంలో అత్యధికంగా రూ.5లక్షల వరకు డిపాజిట్ చేసుకునే అవకాశం ఉందన్నారు. డిపాజిట్‌పై 365 రోజులకు అత్యధికంగా 8.10శాతం వడ్డీ ఇస్తామని తెలిపారు. డీసీసీబీ డైరెక్టర్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో గ్రామీణ వికాస్ బ్యాంక్ ఉన్నప్పటికీ ఖాతాదారులు పెద్ద సంఖ్యలో ఉండడంతో ఖాతాదారులు ఇబ్బంది పడ్డారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకోని నూతనంగా బ్యాంక్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ చుక్క గణేశ్, సీఈవో వెంకటయ్య, రైతులు పింగిళి నరేందర్‌రెడ్డి, ముక్కెర భగంత్, ఎండీ ఖలీలు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి

రేషన్‌బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రోజారాణి

తరిగొప్పుల, జూన్14 : నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రోజారాణి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బేడ బుడిగజంగాల కాలనీ, బొంతగట్టునాగారంలోని ఇళ్లలో సోదాలు నిర్వహించారు. పది రేషన్ షాపులతోపాటు బొంతగట్టునాగారంలోని రేషన్‌షాపును ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజారాణి మాట్లాడుతూ ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు తెల్ల రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఈపాస్ మిషన్‌లోని నిల్వలు, రేషన్ దుకాణంలోని నిల్వలు సమానంగా ఉండాలన్నారు. వీటిలో తేడా కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

లింగాలఘనపురం, జూన్ 14 : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని కళ్లెంలో శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. రక్తనిధి కేంద్రాల్లో నిల్వలు ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 37 యూనిట్ల రక్తాన్ని నిర్వాహకులు సేకరించారు. కళ్లెంకు చెందిన తిప్పారపు గణేశ్ 17 సార్లు రక్తదానం చేయడంతో కలెక్టర్ సత్కరించారు.

పాఠశాలను పరిశీలించిన కలెక్టర్

కళ్లెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలని సూచించారు. పాఠ్యాంశాల్లోని పలు ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మిషన్ భగీరథ సర్వేను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో నెలకొన్న సమస్యల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, తహసీల్దార్ వినయలత, ఎంపీడీవో జలేందర్‌రెడ్డి, ఎంపీవో మల్లికార్జున్, కార్యదర్శి సీతారాంనాయక్, సీవో మహేందర్, డాక్టర్లు కరుణాకర్‌రాజు, సుధీర్, అశోక్, భాస్కర్, నాయకులు తిప్పారపు గణేశ్, ఏలె మూర్తి, తాటిపాముల రమేశ్ పాల్గొన్నారు.

గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు

జనగామ చౌరస్తా: గుట్కా ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వెస్ట్‌జోన్ డీసీపీ పీ సీతారాంతో కలిసి ఆయన జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం (ఎన్‌టీసీపీ)లో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ పొగాకు నియంత్రణను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కిరాణం అండ్ జనరల్ స్టోర్స్, పాన్ షాపుల్లో నిషేధిత గుట్కా, పొగాకు విక్రయాలను అరికట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీతోపాటు పాఠశాలలకు వంద మీటర్ల దూరంలో ప్రచార కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. ప్రజలు రద్దీగా ఉండే బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతి పాఠశాల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో పోలీసులు నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తుల నియంత్రణకు పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసేవారికి రూ.200 జరిమానా విధించాలన్నారు. అవసరమైతే రూ.వెయ్యి జరిమానాతోపాటు రెండేళ్ల జైలు శిక్ష ఉంటుందని షేక్‌రిజ్వాన్ బాషా తెలిపారు. డీసీపీ సీతారాం మాట్లాడుతూ నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయించేవారితోపాటు రవాణా చేసేవారిపై సెక్షన్ 77 ప్రకారం పొగాకు ఉత్పత్తుల వాడకం, మైనర్లకు డ్రగ్స్ సరఫరా కింద కేసు నమోదు చేస్తామన్నారు. అవసరమైతే రూ.లక్ష జరిమానాతోపాటు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తారని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్ రాజ్, డీఆర్డీవో మొగులప్ప, పరిశ్రమలశాఖ అధికారి రమేశ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.


మల్లిగారి రాజును సత్కరిస్తున్న కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా

89వ సారి రక్తదానం చేసిన రాజు

జనగామ చౌరస్తా : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ప్రాంతానికి చెందిన మల్లిరారి రాజు 89వ సారి రక్తదానం చేశారు. దీంతో రాజుకు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందించారు. శుక్రవారం లింగాల ఘనపురం మండలం కళ్లెంలో నిర్వహించిన రక్తదాన మల్లిగారి రాజు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న అవసరార్థులకు రక్తాన్ని దానం చేయడం తన జీవిత లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినవారు, అత్యవసర సమయంలో ఆపరేషన్ అవసరమైన వారు సకాలంలో రక్తం లభించక మృత్యువాతపడిన సంఘటనలున్నాయని తెలిపారు. ఇలాంటి ఘటనలను నివారించేందుకు తాను 89 సార్లు రక్తదానం చేశానని ఆయన గుర్తు చేశారు.. ఈ సందర్భంగా రక్తదాత రాజును డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్ రాజ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ డీ లవకుమార్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ రాజమౌళి, డాక్టర్ కరుణాకర్‌రాజు, దళిత, గిరిజన సంఘాల నాయకులు అభినందించారు.

అధిక చార్జీలు వసూలు చేయొద్దు

అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

సమావేశంలో మాట్లాడుతున్న రోహిత్ సింగ్

జనగామ చౌరస్తా, జూన్ 14 : మీ సేవ కేంద్రాల్లో వినియోగదారుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయొద్దని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లాలోని మీ సేవ కేంద్రాల నిర్వాహకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రోహిత్‌సింగ్ మాట్లాడుతూ మీ సేవ కేంద్రాలకు వచ్చే వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని నిర్వాహకులు, ఆపరేటర్లకు సూచించారు. కేంద్రాలను కేటాయించిన ప్రాంతంలో మాత్రమే మీసేవ కేంద్రాలు నిర్వహించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్, ఇతర సర్టిఫికెట్ల జారీలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఈడీఎం దుర్గారావు, టెక్నికల్ సర్వీసెస్ జిల్లా మేనేజర్ రాజు, ఆన్‌లైన్ సర్వీసెస్ మేనేజర్ రాకేశ్, మీ సేవ కేంద్రాల యజమానులు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలపై ఎన్ఎంసీ దాడులు ఆపాలి

జనగామ చౌరస్తా, జూన్ 14 : గ్రామీణ ప్రాంత వైద్యులపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) దాడులను వెంటనే ఆపాలని ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి తొమ్మిదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పసునూరి సత్యనారాయణ మాట్లాడుతూ జీవో నంబర్ 428 ప్రకారం గ్రామీణ వైద్యులకు సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. ప్రతి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, బస్తీ దవాఖాన, ఏరియా ఆసుపత్రుల్లో ఆర్ఎంపీ, పీఎంపీలకు ఉపాధి కల్పించాలన్నారు. 2009లో ప్రభుత్వ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి అర్హత సర్టిఫికెట్లు పంపిణీ చేయడంతో పాటు కొత్తవారికి ప్రభుత్వం శిక్షణనివ్వాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా నిరాహార దీక్షకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో పాటు పాలకుర్తి, జఫర్‌గఢ్ మండలాల నుంచి ఆర్ఎంపీ, పీఎంపీలు పెద్ద సంఖ్యలో హాజరై మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంతెన రమేశ్, కోశాధికారి సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటాచారి, కార్యవర్గ సభ్యుడు పోగు గోపీనాథ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆర్ఎంపీలు, పీఎంపీలు

నేడు దేవరుప్పుల మండల సభ

దేవరుప్పుల, జూన్ 14 : మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సభ్యుల కాలపరిమితి ముగుస్తున్నందున చివరి సభకు విధిగా హాజరుకావాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సభలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

తరిగొప్పుల, జూన్ 14 : మండలంలోని అక్కరాజుపల్లికి చెందిన మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్ తండ్రి పోశయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న టీ-పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, సీఎం పీఆర్వో అయోధ్యరెడ్డి శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యూత్ అధ్యక్షుడు అంకం రాజు, బైరి నరేశ్, ఆవుల రాములు, బోగం శ్రీనివాస్, పరమేశ్ ఉన్నారు.

చేతిరాతలో నైపుణ్యం పెంచుకోవాలి

సర్టిఫికెట్లు ఇస్తున్న కౌన్సిలర్ ఎండీ సమద్

జనగామ, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే చేతిరాతలో నైపుణ్యం పెంచుకోవాలని పట్టణంలోని 28వ వార్డు కౌన్సిలర్ ఎండీ సమద్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఎస్ఆర్ ట్యూషన్ అకాడమీ సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా అత్యుత్తమ చేతిరాతలో ప్రతిభ చూపిన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.అకాడమీ నిర్వాహకులు ఎండీ అన్వర్ మాట్లాడుతూ ఎస్ఆర్ ట్యూషన్ అకాడమీలో విద్యార్థులకు హిందీ, తెలుగు, ఇంగ్లిష్, గణితంలో బేసిక్ క్లాసులు నేర్పిస్తామన్నారు చేతిరాత ట్రెయినర్ మెరాజ్, ట్యూషన్ అకాడమీ నిర్వాహకులు అనిత, జ్యోతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'మిషన్ భగీరథ' సర్వే

బచ్చన్నపేట, జూన్ 14 : మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్‌భగీరథ సర్వే కొనసాగుతున్నది. అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, వీవోఏలు ప్రతి రోజూ ఇంటింటికీ వెళ్తూ తాగునీటి సరఫరా, సమస్యలను తెలుసుకున్నారు. సర్వే త్వరగా పూర్తయ్యేలా కృషి చేయాలని ఎంపీడీవో రఘురామకృష్ణ సిబ్బందిని కోరారు. అనంతరం బచ్చన్నపేట, ఆలింపూర్, తమ్మడపల్లి, నారాయణపూర్. గంగాపూర్, కట్కూర్, కొడవటూరులో సర్వేను ముమ్మరం చేశారు. నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేయాలని అధికారులను కోరారు. పంచాయతీ కార్యదర్శులు అనిల్‌రాజ్, సౌజన్య, దేవీప్రసాద్, రాజశేఖర్, ప్రశాంత్‌ఆచార్య, రూపాచైతన్య, కారోబార్లు, వీవోఏలు, పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో భర్తకు పదేళ్ల జైలు

జనగామ చౌరస్తా, జూన్ 14 : భార్యపై హత్యాయత్నం చేసిన భర్తకు పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి విక్రమ్ శుక్రవారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపల్లి మండలం జాఫర్‌గూడేనికి చెందిన బత్తుల నర్సయ్యకు నర్మెట మండలం గండిరామారానికి చెందిన రజితతో వివాహం జరిగింది. భార్యపై అనుమానం పెంచుకున్న నర్సయ్య 2022లో రజితపై గొడ్డలితో హత్యాయత్నం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఈ కేసుపై కోర్టులో జరిగిన వాదోపవాదనల అనంతరం నేరం రుజువు కావడంతో జడ్జి విక్రమ్ నేరస్తుడు నర్సయ్యకు పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో బాధితురాలి తరపున న్యాయవాది పీపీ స్టీఫెన్, సహాయకురాలు శ్రీదేవి వాదనలు వినిపించారని పోలీసులు తెలిపారు.

'డబుల్' ఇళ్ల ఆక్రమణపై ఫిర్యాదు

దేవరుప్పుల, జూన్ 14: మండలంలోని కడవెండిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను అనుమతులు లేకుండా ఆక్రమించుకున్న విషయమై స్థానికులు కొందరు శుక్రవారం సచివాలయంలో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన తాళ్లపల్లి వెంకన్న, పడమటింటి ఏసుపాదం, కత్తుల విజయ్‌కుమార్ ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయేందిర బోయిని కలిసి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కడవెండిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారుల ఎంపికలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కొందరు అనుమతులు లేకుండా ఆక్రమించారని తెలిపారు. జిల్లా అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో తాము సచివాలయంలో ఫిర్యాదు చేయగా రాత్రి ఖాళీ చేయించారని వివరించారు. గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బాషిపాక కుమార్, వయ్యా కరుణాకర్, దండంపెల్లి కరుణాకర్ ఉన్నారు.

హెచ్ఎంలకు పీఆర్‌టీయూ శుభాకాంక్షలు

శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జఫర్‌గఢ్, జూన్ 14 : మండలంలోని తిమ్మంపేట ఉన్నత పాఠశాల హెచ్ఎంగా షారోని, హిమ్మత్‌నగర్ స్కూల్ హెచ్ఎంగా మంగు జయప్రకాశ్, ఉప్పుగల్ పాఠశాల హెచ్ఎంగా ఫరహత్ కౌసర్ బాధ్యతలు చేపట్టారు. వీరికి పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సీతారామయ్యతోపాటు నాయకులు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. మండల కార్యదర్శి సురేశ్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, త్రివేణి, దయాసాగర్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

VEHICLES FOR SALE

★AP36TB4574 Mekala Latha TATA SUPER ACE Mint 2013, TS07UC5388 Asif Shareef Syed TATA ACE 2016, TS03UA7502 Vinay Kumar Devunuri TATA ACE 2015, Acution Date: 15-06-2024, Venue: Shriram Automall India Ltd., Punnel Cross Road Bollikunta, Warangal, Cont: Shriram Finance Limited, H.No. 15-1-237, 2nd Floor, Opp. L.B. Collge, Mulugu Road, Cell: 9849981545, 9966196881.
NTW-00

కావలెను

jobs Apply Now!

★HIV Prevention Programలో పని చేయుటకు అనుభవం గల Female GNM & ORWలు కావలెను. Send your Resume on or before 15/6/2024, rdmm.wgl@gmail.com, Cont: 9849688581, 9959711470.
NTW-323319

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హరిత

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

తరిగొప్పుల, జూన్ 6: గ్రామాల్లో పజల సమస్యలను పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని, అందరికీ అందుబాటులో ఉంటూ ముందుకెళ్లాలని ఎంపీపీ జొన్నగోని హరిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలని కోరారు. అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో రాజీపడేది లేదన్నారు. అనంతరం జడ్పీటీసీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, అధికారులను ఆమె సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఆలం, జడ్పీటీసీ ముద్దసాని పద్మజా వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నూరి ప్రమీలా సంజీవ, ఎంపీటీసీలు అర్జున మధుసూదన్‌రెడ్డి, భూక్యా జాంలాల్‌నాయక్, మంగ, మాజీ సర్పంచ్‌లు దామెర ప్రభుదాస్, ముక్కెర బుచ్చిరాజ్ యాదవ్, బెల్లపు రాజు, భూక్యా రవి పాల్గొన్నారు.

నేడు మూడు మండలాల్లో విద్యుత్ అంతరాయం

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 14 : స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ పరిధిలోని స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాల్లోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈ హుస్సేన్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగం పెరగడంతో అధిక లోడ్ కారణంగా స్టేషన్ ఘన్‌పూర్ 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో 2000 సంవత్సరంలో బిగించిన వైర్ల స్థానంలో అధిక సామర్థ్యం గల కొత్త వైర్లను అమర్చుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. శివునిపల్లి, తాటికొండ, ఫత్తేపూర్, ఇప్పగూడెం, చిల్పూరు, మల్కాపూర్, రాజవరం, చిన్నపెండ్యాల, నమిలిగొండ, తిమ్మంపేట, ఉప్పుగల్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని హుస్సేన్‌నాయక్ కోరారు.

విద్యుత్ అంతరాయాలను నివారించాలి

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 14 : విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించి, వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని విద్యుత్ సిబ్బందికి ఏఈలు సూచించారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో పెప్ టాక్ నిర్వహించారు. విద్యుత్ కార్మికులు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో భద్రతా అంశాలను పాటిస్తూ ఫీడర్ అంతరాయాలను పర్యవేక్షించాలని సూచించారు. ఈదురుగాలులతో ఏర్పడే ఆటంకాలను త్వరిత గతిన పునరుద్ధరించి వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని వారు కోరారు. ఈ సమావేశంలో పులి చంద్రమౌళి, టీ రమేశ్, శివకుమార్, విశ్వసాహితి, రణధీర్, టీ రాము పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంపై అదనపు కలెక్టర్ ఆగ్రహం

వైద్యుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న పింకేశ్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 14 : డ్యూటీలో నిర్లక్ష్యం తోపాటు సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరైన వైద్యులకు మెమోలు జారీ చేసినా వారిలో మార్పు రాకపోవడంతో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. డివిజన్ కేంద్రంలోని యూపీహెచ్‌సీ దవాఖానను ఇటీవల స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి తనిఖీ చేశారు. ఎనిమిది మంది వైద్యుల్లో ఐదుగురు గైర్హాజరవగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరు కాని వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించడంతో వారికి మెమోలు జారీ చేశారు. ఈ క్రమంలో గురువారం సదరు డాక్టర్లు కలెక్టర్ కార్యాలయంలో వివరణ ఇచ్చారు. శుక్రవారం అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ దవాఖానను తనిఖీ చేశారు. డ్యూటీలో ఉండాల్సిన వైద్యురాలు రజిని లేకపోవడంతో ఆస్పత్రి ఇన్‌చార్జి పులి చంద్రమౌళితో ఫోన్‌లో మాట్లాడిన అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ దవాఖానను సందర్శించి వైద్యుల పనితీరు, వారి హాజరు శాతాన్ని పరిశీలించాలని ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీవో సుధీర్ కుమార్‌ను ఆదేశించారు.

కేజీబీవీలో అభివృద్ధి పనుల పరిశీలన

చిల్పూరు: మండలంలోని రాజవరం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ఎంపికైన రాజవరం కేజీబీవీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు లక్ష్యానికనుగుణంగా త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. పెండింగ్ పనులు, నిధుల కొరత ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పింకేశ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాము, డీసీడీవో గౌసీయాబేగం, ఆర్ఐ శ్రీనివాస్, ఎంపీడీవో శంకర్, ఎంపీవో మధుసూదనాచారి, పాఠశాల ఇన్‌చార్జి సోని పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 14: నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు కోరారు. తరిగొప్పుల మండలం పోతారం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వర్తించి మండల క